సాక్షి పెద్దపల్లి

బుధవారం । 31 । జనవరి । 2024



సీహెచ్‌పీ సందర్శన

గోదావరిఖని: రామగుండం డివిజన్‌–2లోని ఓసీపీ–3 సీహెచ్‌పీని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య మంగళవారం సందర్శించారు.



జంతు సంరక్షణపై అవగాహన

పెద్దపల్లిరూరల్: జంతు సంరక్షణ, నిబంధనలపై పౌరులకు అవగాహన ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. కలెక్టరేట్‌లో ప్రచార పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం
30.6/16.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళి అర్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: దేశ స్వాతంత్య్ర సమరంలో మహాత్మాగాంధీ అహింసా మార్గం ఎంచుకున్నారని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. పలు శాఖల జిల్లా అధికారులతో కలిసి ఆయన రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం సాగించిన యోధులను ఆదర్శంగా తీసుకోవాలని, వారి ప్రాణత్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ఫరూక్

రామగిరి(మంథని): ప్రతీఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పెద్దపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఫరూక్ సూచించారు. సెంటనరీకాలనీ హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆయన ఆయన మాట్లాడారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలించరాదని ఆయన సూచించారు. మద్యం తాగి, అతివేగంగా వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపతి, హోంగార్డు నక్క నగేశ్, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్షణే ప్రథమం



ఏపీఏ గని వద్ద సేఫ్టీ డీఎంఎస్ బిశ్వనాథ్

రామగిరి(మంథని): విద్యుత్ వినియోగిస్తున్న సమయంలో రక్షణ సూత్రాలు పాటించాలని సౌత్ సెంట్రల్ జోన్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) బిశ్వనాథ్ బెహరా సూచించారు. మంగళవారం ఆర్జీ–3లోని ఏపీఏ గనిని ఆయన సందర్శించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు ఆయన తనిఖీ చేశారు. గనిలోకి దిగి లాంగ్‌వాల్ 3వ ప్యానల్ ఏర్పాటు కోసం అమర్చిన విద్యుత్ పరికరాల పనితీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. గనిలో చేపట్టే భద్రత చర్యల గురించి జీఎం వెంకటేశ్వర్లు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.సీతారామం, ప్రాజెక్టు ఇంజినీర్ టి.రఘురాం, ఎస్‌వోఎం కె.జనార్దన్, సేఫ్టీ ఆఫీసర్ ఎం.రమేశ్, ఎస్‌ఈ బాలరాజు, ఈఈ అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమ్మె నోటీసు

జ్యోతినగర్(రామగుండం): సంయుక్త కిసాన్ మోర్చా(రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఐక్యవేదిక) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటామని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఎన్టీపీసీలోని అధికారులకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం నాయకులు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేస్తామన్నారు. ప్రారిశ్రామిక వివాదాల చట్టం–1947 సెక్షన్–22, సబ్ సెక్షన్(1) అనుసరించి సమ్మె నోటీసు అందిస్తున్నట్లు తెలిపారు. నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, భూమయ్య, రాజమల్లయ్య, సత్యం, ఆర్.లక్ష్మణ్, జయసింహ, నాగభూషణం, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిన్నింగు మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు

పెద్దపల్లిరూరల్: రైతులు తమ పత్తిని జిన్నింగు మిల్లుల్లోని సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. కొందరు సీసీఐ కేంద్రాలు మూసివేస్తారని అసత్యప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. నాణ్యమైన పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్ముకోవచ్చని, చివరి తేదీ అంటూ ఇప్పటివరకు నిర్ణయించలేదని స్పష్టం చేశారు. పత్తిరైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

బాధ్యులెవరు?

- బొగ్గు గనుల్లో తరచూ ప్రమాదాలు
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు
- ఈనెలలోనే ఒకరి మృతి, ఆరు ప్రమాదాలు
- ఆధునిక సాంకేతికత వినియోగిస్తున్నా నిష్ప్రయోజనమే..!

సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి సాధన కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. అత్యాధునిక యంత్రసామగ్రి సాయంతో నిర్దేశిత లక్ష్యాలు సాధిస్తున్నారు. అడుగడుగునా రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. సేఫ్టీ అధికారుల నుంచి జీఎం స్థాయి వరకూ ఉన్నతాధికారులు ప్రతీక్షణం పర్యవేక్షిస్తున్నారు. పనిస్థలాల్లో రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని కార్మికులు, ఉద్యోగులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. అయినా, గనుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడం, కార్మికులే కాదు.. మైనింగ్ సర్దార్ స్థాయి ఉద్యోగులూ చనిపోవడం, గాయాలపాలవడం ఉన్నతాధికారులకు సవాల్‌గా మారుతున్నాయి.



గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, మృతుడి బంధువులు(ఫైల్)

- ఈనెల 22న : ఆర్జీ – 1లోని జీడీకే–2ఏ గనిలో టబ్బుల మధ్య జాయింట్ ఊడిపోయి ఢీకొనడంతో మైనింగ్ సర్దార్ మందల సమ్మిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 28న చనిపోయారు.
- ఈనెల 23న : ఆర్జీ – 3లోని ఏపీఏ గనిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు మంగళ్‌సింగ్ హ్యాంగ్లర్ పైనపడి తీవ్రగాయాలపాలయ్యాడు.
- ఈనెల 29న : ఆర్జీ – 1లోని జీడీకే 1, 3వ గనిలో సైడ్‌ఫాల్ కావడంతో జనరల్ మజ్దూర్ కార్మికుడు బి.అనిల్ గాయపడ్డాడు.
- ఇదేనెలలో : మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని కాసిపేట – 2వ గనిలో జరిగిన ప్రమాదంలో మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్(37) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చనిపోయారు.

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలు కార్మికులు, వారి కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఐదేళ్లలో ప్రమాదాల సంఖ్య తగ్గినా.. కొత్త తరహాలో చోటుచేసుకుంటున్న యాక్సిడెంట్లు అధికారులను కూడా కలవరపెడుతున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా, కొత్త తరహాలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు కార్మికులు, వారి కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల జీడీకే–2ఏ గనిలో జరిగిన ప్రమాదం మరోసారి రక్షణ చర్యలను సమీక్షించేలా చేస్తోంది. బొగ్గు లోడ్‌తో గని పైకి వస్తున్న టబ్బుల లింక్ ఊడిపోయి వేగంగా కిందకు జారింది. ఈక్రమంలో అక్కడ ఉన్న మైనింగ్ సర్దార్‌ను ఢీకొట్టడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ్నాయన మృతి చెందారు. ఆ సమయంలో అక్కడ మరో ఏడుగురు కార్మికులు అప్రమత్తమై పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. ఒకవేళ వారు గమనించకపోతే అతిపెద్ద ప్రమాదమే జరిగేదంటున్నారు. ఈక్రమంలో ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలనే డిమాండ్ పెరుగుతోంది.

సంవత్సరం	2020	2021	2022	2023	2024
ప్రమాద మరణాలు	09	13	05	05	01
సీరియస్ ప్రమాదాలు	98	122	96	96	06
రిపోర్టబుల్ ప్రమాదాలు	108	107	122	70	05

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

- బొగ్గు గనుల్లో జరిగే ప్రమాదాల నివారణకు సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ విధానం కొనసాగుతోంది.
- గనుల్లో వెలికి తీయాల్సిన బొగ్గు, అందుకు తీసుకోవాల్సిన రక్షణ చర్యలను ముందే గుర్తించి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.
- కానీ, అన్ని చర్యలు తీసుకున్నా.. కొత్త తరహాలో ప్రమాదాలు జరగడం అధికారులకు సవాల్‌గా మారుతోంది.
- జీడీకే–2ఏ గనిలో చిన్నపాటి నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలితీసుకుందని అంటున్నారు.
- టబ్బుల లింక్ ఊడకుండా లాక్ సౌకర్యం ఉన్నా.. ఈసంఘటన ఎలా జరిగిందనే దానిపై అధికారులు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

రక్షణే ప్రథమం

పని స్థలాల్లో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టిన తర్వాతే బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలి. ఒకటికి రెండుసార్లు రక్షణ చర్యలు సరిచూసుకున్న తర్వాతే బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలి. అలాగే భూగర్భ గనుల్లో మరిన్ని జాగ్రత్తలు తప్పనిసరి. ప్రమాదాల నివారణకు యాజమాన్యం అన్నిచర్యలు తీసుకుంటోంది. ప్రత్యేక విధానాలను అవలంబిస్తోంది. రక్షణ విషయంలో రాజీలేకుండా ముందుకు సాగుతున్నాం.

– కె.గురువయ్య, కార్పొరేట్ సేఫ్టీ జీఎం

ప్రయోగాల శిక్షణతో సత్ఫలితాలు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

జ్యోతినగర్(రామగుండం): ప్రయోగాలతో శిక్షణ పొందడం ప్రయోజనకరంగా ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్‌లో మహేంద్ర టెక్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జీవశాస్త్రవర్క్ షాప్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. విద్యార్థుల్లో పాఠ్యాంశంపై ఆసక్తి పెంచేలా ప్రయోగాలను వివరించాలని అన్నారు. వర్క్‌షాప్ ముగిశాక ఉపాధ్యాయులకు సైన్స్‌కిట్లు అందిస్తామని తెలిపారు. మహేంద్ర టెక్ ప్రతినిధి రేవతి బృందం, జిల్లా అకడమిక్ ఇన్‌చార్జి పీఎం షేక్, హెచ్‌ఎం జయరాజ్, సైన్స్ ఇన్‌చార్జి అమీర్ అలీ, మాస్టర్ ట్రైనర్ కృష్ణమోహనమూర్తి, తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గూళ్ల అంజన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మూల నరేశ్ పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో చదవాలి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక కార్యాచరణతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఎఫ్‌సీఐ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులపై ఒత్తిడి లేని విద్య బోధించాలని సూచించారు. అనంతరం పాఠశాల అవసరాల కోసం రూ.10వేల విలువైన చెక్కును హెచ్‌ఎం విమలకు అందించారు. ఏఎంవో పీఎం షేక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాల పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ, సీడీపీ, సీఎస్ఆర్, సీబీఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఇంజినీరింగు, సంబంధిత అధికారులతో తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు మొదలుకాని పనుల్లో అత్యవసరమని భావించే వాటిని మాత్రమే వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఆ పనుల నివేదికను ప్రత్యేకంగా అందించాలన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒకే నమూనాలో బస్‌షెల్టర్లు ఉండేలా చూడాలన్నారు. వైకుంఠధామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సీపీవో రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ గిరిష్‌బాబు, రషీద్, ఆర్‌అండ్‌బీ ఈఈ రాములు పాల్గొన్నారు.



ప్రయోగాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

అర్హులందరికీ గ్యారంటీ పథకాలు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- ప్రొటోకాల్ విస్మరించడంపై అధికారులకు వార్నింగ్

ధర్మారం(ధర్మపురి): కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ గార్యరంటీ పథకాల ప్రయోజనాలు అందిస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బొమ్మారెడ్డిపల్లి గ్రామపంచాయ, ధర్మారంలో మహిళా గ్రామైక్య, బంజేరుపల్లి తండా బీ, మల్లాపూర్, రచ్చపల్లి, ఖానంపల్లి గ్రామపంచాయతీ భవనాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళా సమాఖ్యలను బలోపేతం చేస్తామని తెలిపారు. ధర్మారంలోని మండల మహిళా సమాఖ్య భవన స్థలం హద్దులు గుర్తించి యాజమాన్య హక్కులు కల్పిస్తామని అభయం ఇచ్చారు. జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, సర్పంచులు పుస్కూరి జితేందర్‌రావు, గాగిరెడ్డి ప్రేమలతరెడ్డి, భూక్య చంద్రానాయక్, గందం వరలక్ష్మి, గుర్రం మనీషా, మోర సుధాకర్, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో జయశీల, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు కొత్త నర్సింహులు, చింతల జగన్మోహన్‌రెడ్డి, బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, లావుడ్య రూప్లానాయక్, ఎదుల్ల అంజయ్య, గందం మహేందర్, దేవి జనార్దన్, కాడే సూర్యనారాయణ, జనగామ తిరుపతి సోగాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రొటోకాల్‌పై ఆగ్రహం

అధికారులు వ్యక్తిగత అజెండాతో పనిచేయరాదని, తన పర్యటనకు కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదని లక్ష్మణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మారం పర్యటన సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లలో ఏపీఎం తులసి తీరుపై ఆయన మండిపడ్డారు. మహిళలు కూర్చునేందుకు కనీసం కుర్చీలు ఎందుకు సమకూర్చలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ విప్ పర్యటనకు వస్తే.. డీఆర్‌డీవో పీడీ గైర్హాజరు కావడం ఏమిటని తప్పుపట్టారు. వెంటనే పీడీకి ఫోన్ చేసి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇంకా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నట్లు అధికారులు భావిస్తే సహించేదిలేదని అడ్లూరి హెచ్చరించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- జిల్లా ఇంటర్ విద్య అధికారి కల్పన

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి కల్పన తెలిపారు. ఇంటర్ విద్య అధికారులతో మంగళవారం సమావేశమై ఫిబ్రవరి 1నుంచి నిర్వహించే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. ఫిబ్రవరి 1నుంచి 15వ తేదీ దాకా జిల్లాలో మూడు విడతల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 32 జనరల్, 16 ఒకేషనల్ ప్రాక్టికల్ కేంద్రాల్లో సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరీక్షలకు 2,698 మంది సైన్స్ విద్యార్థులు హాజరవుతారన్నారు. తొలివిడత ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు, మలివిడత 6 నుంచి 10 వరకు, మూడో విడత 11 నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. 16న ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్, 17న పాత విద్యార్థులకు నైతికత, మానవ విలువల పరీక్ష, 19న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయని వివరించారు. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా హాల్‌టికెట్లు అందించాలని ఆమె సూచించారు. సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వజ్రోత్సవం

ఎలిగేడు(పెద్దపల్లి): ఎలిగేడు – సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ 75వ సంతాల వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సర్పంచ్ అర్సనపెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. 1948లో ఒకటి నుంచి మూడో తరగతితో ప్రారంభమైన పాఠశాల.. అంచెలంచెలుగా ఎదిగి జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న ఎంపీపీ స్రవంతి

ప్రత్యేకాధికారి తిరుపతిరావు, ఎంఈవో కవిత, హెచ్‌ఎంలు నరేంద్రచారి, అప్పిడి సంతోష్‌రెడ్డి, కిచెన్ గార్డెన్ సృష్టికర్త సుదర్శన్, ఉప సర్పంచ్ పల్లె హరీశ్‌గౌడ్, స్వాతంత్య్ర సమరయోధుడు తానుపర్తి కాంతారావు, ఉస్మానియా రిటైర్డ్ ప్రొఫెసర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సెకండ్ ఫేజ్ ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గోదావరిఖని: కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) ఆన్‌లైన్ ప్రక్రియ సెకండ్ ఫేజ్ పనులు బుధవారం ప్రారంభవుతాయని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, స్టాండర్డైజేషన్ కమిటీ సభ్యుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎంపీఎఫ్ పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ అమలుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అవినీతికి తావులేకుండా, నిధుల మళ్లింపునకు అవకాశం లేకుండా ప్రతీకార్మికుడు కుటుంబ సభ్యులకు మొబైల్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. భవిష్యనిధి ఇతర సంస్థల్లో పెట్టుబడుల రూపంలో పెట్టాలనే ఆలోచనా విధానం భద్రత లేనిదన్నారు. అవినీతి, కుంభకోణాలకు పాల్పడిన దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ నుంచి రావాల్సిన సొమ్మును సీఎంపీఎఫ్ ట్రస్టీలో జమచేసేందుకు కృషి చేస్తామని అన్నారు. నాయకులు హరీశ్, సతీశ్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన అధికారులు

గోదావరిఖని: నూతనంగా ఎన్నికైన సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ మంగళవారం సంస్థ సీ అండ్ ఎండీ ఎన్.బలరాంను కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అధికారుల పదోన్నతులు, కోలిండియాలోని పదోన్నతి విధానం అమలు, అధికారులకు ల్యాప్‌టాప్‌ల అందజేత, ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. రీజియన్‌లో కేవీ స్కూళ్ల ఏర్పాటు, అప్పిలేట్ బోర్డు ఏర్పాటుపై చర్చించారు. త్వరలో అధికారుల సంఘంతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మీపతిగౌడ్ తెలిపారు. సీఅండ్ఎండీని కలిసిన వారిలో అధికారుల సంఘం నేతలు పి.నర్సింహులు, పోనుగోటి శ్రీనివాస్, విజయభాస్కర్‌రెడ్డి, రాజీవ్‌కుమార్, రాజగోపాల్, నరేశ్ ఉన్నారు. అనంతరం డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ, కోల్‌మూమెంట్ ఈడీ అల్విన్, కో ఆర్డినేషన్ జీఎం సురేశ్ తదితరులను కలిశారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

మలుపులు తిప్పిన కాసులు

- అప్పన్నపేట సింగిల్‌విండో చైర్మన్ ఎన్నికలో ఎత్తులకు పైఎత్తులు
- డైరెక్టర్ తిరుపతికి చుక్కలు చూపించిన వైస్‌చైర్మన్
- కార్యాలయం ఎదుట డైరెక్టర్ల కారు అడ్డగించిన తిరుపతి వర్గం
- చైర్మన్ ఎన్నిక సమావేశానికి హాజరు కాకుండా తరలించుకుపోయిన వైనం

పెద్దపల్లిరూరల్: అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దాసరి చంద్రారెడ్డి(మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమీప బంధువు)పై సోమవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఆయన పదవి కోల్పోయారు. దీంతో మంగళవారం కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. ఆ కుర్చీ తననే వరిస్తుందని ఆశపడ్డ తిరుపతికి భంగపాటు ఎదురైంది. చైర్మన్ పదవి కోసం అనూహ్యంగా తెరపైకి వచ్చిన వైస్ చైర్మన్ సంపత్.. డైరెక్టర్లను వెంట బెట్టుకుని సమావేశానికి హాజరయ్యారు. కంగుతున్న తిరుపతి వర్గీయులు.. సంపత్ మినహా డైరెక్టర్లందరినీ అడ్డుకుని వేరే కారులో రహస్యప్రాంతానికి తరలించారు. దీంతో సొసైటీ వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

మారిన సీన్..

సోమవారం జరిగిన సమావేశంలో చైర్మన్ చంద్రారెడ్డిని పదవీచ్యుడిని చేసిన డైరెక్టర్లు.. మంగళవారం నాటి సమావేశంలో ఆరె తిరుపతికి మద్దతుగా నిలిచి చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంది. కానీ, సోమవారం రాత్రి వైస్ చైర్మన్ చింతపండు సంపత్ అసంతృప్తి డైరెక్టర్లందరితో మంతనాలు జరిపారు. తిరుపతి ఇచ్చిన సొమ్ముకన్నా ఎక్కువ ముట్టజెబుతానని ఆశచూపడంతో వారు సంపత్‌కు మద్దతుగా నిలిచారు. ఈ విషయాన్ని మంగళవారం ఉదయం గుర్తించిన తిరుపతి కంగుతిన్నారు.



అప్పన్నపేట సొసైటీ వద్ద పోలీసు బందోబస్తు

అడ్డుకుని.. డైరెక్టర్లను తరలించి..

సొసైటీ చైర్మన్ ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన వైస్‌చైర్మన్ సంపత్‌సహా డైరెక్టర్లను డైరెక్టర్ తిరుపతి తన వర్గీయుల సహకారంతో అడ్డుకున్నారు. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. తిరుపతి వర్గీయులు డైరెక్టర్లను వేరే కారులో రహస్య ప్రాంతానికి తరలించుకుపోయారు. ఈక్రమంలో డైరెక్టర్లతో సంపత్ కలిసి వచ్చిన కారులోని నోట్ల కట్టలు బయటకు తీసి పోలీసులకు అప్పగించారు.

సమావేశం నేటికి వాయిదా

సమావేశానికి సభ్యులు హాజరు కాలేదని, దీంతో బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల తెలిపారు. బుధవారం కోరం లేకపోయినా సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యాలయం బయట నెలకొన్న పరిస్థితులతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. కాగా, చైర్మన్ ఎన్నికను సామరస్యంగా జరుపుకోవాలని సీఐ కృష్ణ కోరారు. అనవసరపు గొడవలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తామని సీఐ హెచ్చరించారు.

సంపత్‌కే చైర్మన్ పదవి!

చైర్మన్ పదవి చింతపండు సంపత్‌నే వరించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామ పెద్దల సమక్షంలో తిరుపతి, సంపత్ జరిపిన చర్చల్లో అధిక మొత్తంలో డబ్బులు ఇచ్చేందుకు సిద్ధమైన సంపత్‌తోనే డైరెక్టర్లు క్యాంపునకు తరలివెళ్లినట్లు సమాచారం. అప్పటికే తిరుపతి నుంచి తీసుకున్న మొత్తాన్ని కూడా డైరెక్టర్లు తిరిగి ఆయనకే ఇచ్చినట్లు చర్చించుకుంటున్నారు. బుధవారం సంపత్ ఎన్నిక లాంఛనమేనని అంటున్నారు. ఏదేమైనా అప్పన్నపేట విండో అవిశ్వాసపర్వంలో సంపత్ చైర్మన్ పదవికి ఎన్నికైతే.. ఖాళీ అయిన వైస్‌చైర్మన్ పదవికి మరికొద్ది రోజుల్లో ఎన్నిక అనివార్యం కానుంది.



వైస్‌చైర్మన్ కారును అడ్డుకుంటున్న తిరుపతి వర్గం



పోలీసు చేతికి చేరిన కరెన్సీ కట్టలు

ప్రశాంతంగా మజ్దూర్ రాత పరీక్ష



గోదావరిఖని: సర్వే మజ్దూర్ రాత పరీక్షను మంగళవారం ఆర్జీ–2 ఏరియాలో నిర్వహించారు. యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి పాఠశాలలో జనరల్ మజ్దూర్లకు ఇంటర్నల్ సర్వే మజ్దూర్‌గా ఎంపిక చేసేందుకు రాత పరీక్ష నిర్వహించారు. ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. 5 ఖాళీలకు 137 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 119 మంది పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో అధికారులు జి.రాజేంద్రప్రసాద్, బుక్య దేశాయి, వేణుగోపాల్, ఫణీంద్ర, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహమ్మద్ పాల్గొన్నారు.

మల్లన్నస్వామి ఆదాయం రూ.30లక్షలు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈసందర్భంగా రూ.30,77,643 సమకూరినట్లు ఈవో సదయ్య, వైస్‌చైర్మన్ బత్తుల రమేశ్ తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాత, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ధర్మకర్తలు, వాసవి సేవాసమితి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరీంనగర్ జిల్లాస్థాయి రగ్బీ పోటీలు



శంకరపట్నం(మానకొండూర్): తాడికల్‌లో రగ్బీ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు టి.చిరంజీవి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ –14 బాలబాలికల పోటీలను మంగళవారం నిర్వహించారు. వీణవంక, హుజూరాబాద్, మానకొండూర్, కరీంనగర్, శంకరపట్నం మండలాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైనవారు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

నామాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి సస్పెన్షన్

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని నామాపూర్ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సంతోష్, జీపీ కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ యాస్మిన్‌బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో మహేందర్ తెలిపారు. గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన బోరుబావులతోపాటు ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో బిగించిన హైమాస్ట్ లైట్లకు గ్రామ పంచాయతీ నుంచి నిధులు డ్రా చేసి, దుర్వినియోగం చేశారని గ్రామానికే చెందిన ముదిగంటి పవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో కనకదుర్గ ఇటీవల విచారణ జరిపి, కలెక్టర్‌కు నివేదిక అందించడంతో ఆ ముగ్గురిపై తాత్కాలికంగా సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎంపీవో పేర్కొన్నారు.

'అర్చక' క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడి నియామకం




మాధవాచార్యులు

కథలాపూర్(వేములవాడ): గంభీర్‌పూర్‌కు చెందిన అర్చకుడు ఓరుగంటి మాధవాచార్యులు ధూపదీప నైవేద్య అర్చక సంఘం క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాధవాచార్యులు ప్రస్తుతం సంఘం జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

గోదావరిలో ప్రాణగుండాలు

- ఎగువ ప్రాంతాల్లో 5 గుండాలు
- సత్యవతి, బ్రహ్మ అతి ప్రమాదకరం
- పుణ్యస్నానాలకు వెళ్లి గతంలో ఎంతోమంది మృతి
- ధర్మపురి వద్ద తగ్గుముఖం పట్టిన నీటిమట్టం
- ప్రమాద సూచికలు ఏర్పాటు చేయని వైనం



ప్రమాదకర గుండాల వద్ద స్నానం చేస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి గోదావరి వద్ద నీటిమట్టం తగ్గుతోంది. పుణ్యస్నానం కోసం వెళ్తున్నవారు జర భద్రం. ఎందుకంటే పై ప్రాంతాల్లో ప్రమాదకర గుండాలున్నాయి. లోతు తెలుసుకోకుండా వెళ్లిన ఎంతోమందిని అవి మింగేశాయి. వారి కుటుంబాలకు కడుపుకోత మిగిలింది. ఏటా వేసవి సమీపిస్తే చాలు గోదావరి నీటిమట్టం తగ్గుతుంది. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ఎగువ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం.

దక్షిణ కాశీగా పేరు..

జగిత్యాల జిల్లాలోని ధర్మపురిని దక్షిణ కాశీగా పిలుస్తుంటారు. ఇది ఒక ప్రాచీన పుణ్యక్షేత్రం. ఇక్కడ లక్ష్మీనృసింహస్వామితోపాటు పవిత్ర గోదావరి ఉంది. నది దక్షిణ ముఖంగా ప్రవహించడంతో దక్షిణ కాశీగా పేరొచ్చింది. ఇందులో స్నానం చేస్తే కాశీలో చేసినంత పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే, ఈ క్షేత్రానికి నిత్యం మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది వస్తుంటారు. ముందుగా గోదావరిలో స్నానం చేసి, స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ.

ఎల్లంపల్లి బ్యాక్ వాటర్..

ధర్మపురి గోదావరిలో సత్యవతి, బ్రహ్మ, యమ, పాల, చక్ర గుండాలున్నాయి. వీటిలో అతి ప్రమాదకరమైనవి సత్యవతి, బ్రహ్మగుండాలు. ఇవి అతి లోతైన ప్రదేశాలు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో ఏడాదిలో 8 నెలలపాటు గోదావరి నిండుకుండను తలపిస్తూ పుష్కరఘాట్లను ఆనుకొని పారుతుంది. దీంతో భక్తులు ఎగువ ప్రాంతాలకు వెళ్లలేక పుష్కరఘాట్ల వద్దే పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండటంతో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. దీంతో భక్తులు తమ కుటుంసభ్యులతో కలిసి స్నానాల కోసం ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడ గతంలో ఈత కొట్టేందుకు వెళ్లిన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, నిజామాబాద్, ఆర్మూర్, ఆదిలాబాద్, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన చాలామంది నీటమునిగి చనిపోయారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంఘటలున్నాయి. అందుకే భక్తులు జాగ్రత్తలు పాటించాలి.

బోర్డులు, జాలీలు ఏర్పాటు చేయాలి

ప్రమాదకర గుండాలున్నాయని దేవస్థానం వారు గోదావరి ఒడ్డున సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించని భక్తులు స్నానం చేసేందుకు ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆయా గుండాల వద్ద సూచిక బోర్డులు, జాలీలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు. ముఖ్యంగా భక్తులు స్నానాలు చేసే చోట నిఘా కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మాకు లోతు తెల్వదు



మాది పెగడపెల్లి మండలం దోమలకుంట. ప్రతీ సంవత్సరం గోదావరి స్నానానికి వస్తున్నం. మాకు ఇక్కడ లోతు ఎంతుంటదో తెల్వదు. బోర్డులు పెడితే బాగుంటది.

– లక్ష్మి, భక్తురాలు

లోపలికి పోతున్నరు



మాది మల్యాల మండలం. గోదావరి గుండాల కాడ స్నానం కోసం చాలామంది లోపలికి పోతున్నరు. ప్రమాదం జరగకముందే లోపలికి వెళ్లకుండా జాలీలు పెట్టాలి.

– విజయ, భక్తురాలు

ఆటోలో ఆఫీస్‌కు వెళ్తూ.. కిందపడి

- యువకుడి మృతి
- పెళ్లయిన ఏడాదికే అనంతలోకాలకు..



సంతోష్ మృతదేహం

ధర్మపురి: ఆఫీస్‌కు వెళ్లేందుకు ఇంటినుంచి బయలుదేరిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన మ్యాన శంకర్–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కొడుకు సంతోష్(27) వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఆటోలో ఆఫీస్‌కు వెళ్తుండగా బూరుగుపల్లె సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తీసుకెళ్లి, చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు.

ఇటీవలే ఘనంగా పెళ్లిరోజు..

సంతోష్‌కు గతేడాది వెల్గటూర్ మండలంలోని కొత్తపేటకు చెందిన సుమలతతో వివాహం జరిగింది. ఇటీవలే పెళ్లిరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెళ్లయిన ఏడాదికే అతను మృతి చెందడంతో భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆటోడ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా ఆటో నడపడం వల్లే సంతోష్ కిందపడ్డాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

వ్యక్తి దుర్మరణం



తిరుపతి మృతదేహం

జగిత్యాల క్రైం/ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దోనూర్‌కు చెందిన గొల్లెన తిరుపతి(37), అతని మిత్రుడు శివరాత్రి తిరుపతి సోమవారం బైక్‌పై జగిత్యాల వెళ్లారు. రాత్రి తిరిగి వస్తూ తిప్పన్నపేట శివారులో వాహనం ఆపగా, శివరాత్రి తిరుపతి మూత్ర విసర్జనకు వెళ్లాడు. గొల్లెన తిరుపతి బైక్‌పై ఉండగా ఓ కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

రుద్రంగి(వేములవాడ): బావిలో పడి ఓ గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన రుద్రంగి మండలంలోని మానాలలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్‌కుంద మండల కేంద్రానికి చెందిన భాగయ్య(24) తన గొర్రెలను మేత కోసం మానాలకు తీసుకువచ్చాడు. మంగళవారం జీవాలను మేపుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చాక మృతదేహాన్ని వెలికితీయించి, పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లైంగిక దాడికి యత్నించిన కేసులో వ్యక్తికి జైలు

కరీంనగర్ క్రైం: బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో వ్యక్తికి తాళ్లపల్లి శంకరయ్యకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ రెండో ప్రత్యేక పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవాణి మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... వెల్గటూర్ మండలంలోని ఎండపల్లికి చెందిన దంపతులు చొప్పదండిలో నివసిస్తూ కూలీ పని చేస్తున్నారు. వీరికి ఒక పాప, బాబు సంతానం. 2020 జూలై 15న ఉదయం తల్లిదండ్రులు పనికి వెళ్లగా ఇద్దరు పిల్లలు ఇంటివద్ద ఉన్నారు. వీరి ఇంటి పక్కన ఉండే శంకరయ్య మధ్యాహ్నం తొమ్మిదేళ్ల బాలికను తన ఇంట్లోకి తీసుకెళ్లి, లైంగిక దాడికి యత్నించాడు. ఆమె తమ్ముడు అరవడంతో శంకరయ్య పారిపోయాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చొప్పదండి అప్పటి ఎస్సై వంశీకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరెల్లి రాములు కోర్టులో ప్రవేశపెట్టి, వాదనలు వినిపించారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి, నేరస్తుడికి జైలుశిక్ష, జరిమానా విధించారు.

గోపరపల్లి, పెగడపల్లి గ్రామాల్లో విషాదం

కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓదెల మండలంలోని గోపరపల్లిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం గ్రామంతోపాటు కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లిలో విషాదం నింపింది. పెగడపల్లికి చెందిన మహేశ్, గోపరపల్లెకు చెందిన వంశీకృష్ణారెడ్డిల మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇదే ప్రమాదంలో గాయపడిన సుల్తానాబాద్ పట్టణంలోని సుగ్లాంపల్లి చెందిన పసెడ్ల సంజయ్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని అతని తండ్రి సంపత్ తెలిపారు. వైద్యులు మంగళవారం ఒక శస్త్రచికిత్స చేశారని, మరో రెండు ఆపరేషన్లు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కాగా, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహేశ్, వంశీకృష్ణారెడ్డిల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయింది. మృతుల కుటుంబసభ్యులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఓదార్చారు.

ధర్మనిధి సాహిత్య పురస్కారం అందజేత



అవార్డు అందుకుంటున్న దాస్యం సేనాధిపతి

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని కరీంనగర్‌కు చెందిన కవి, విమర్శకుడు దాస్యం సేనాధిపతి అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పరిషత్తు ప్రాంగణంలో గల దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పరిషత్తు అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, జుర్రు చెన్నయ్యల చేతులమీదుగా అవార్డు, రూ.5 వేలు, జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): జేఈఈ మెయిన్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతోంది. తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్, శ్రీ చైతన్య కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ చైతన్యలో మంగళవారం ఉదయం 147 మంది విద్యార్థులకు గాను 142 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ఇక్కడ పరీక్ష నిర్వహించలేదు. అయాన్ సెంటర్‌లో ఉదయం 680 మందికి గానూ 673 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 634 మందికి గానూ 620 మంది వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైస్‌మిల్లులో పేలిన బాయిలర్



సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని గోపికృష్ణ ఇండస్ట్రీస్‌లో బాయిలర్ పేలింది. స్థానికుల వివరాల ప్రకారం.. రైస్‌మిల్లులో ధాన్యం ఉడకబెట్టే బాయిలర్ మంగళవారం ప్రమాదవశాత్తు పేలింది. ఆ సమయంలో అక్కడ మిల్లు కార్మికులు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. కాగా, ఈ ప్రమాదంలో గోదాం, ఊక రూం కూలిపోయాయని, సుమారు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లిందని యజమాని సాగర్‌రావు తెలిపారు. విషయం తెలుసుకున్న రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు తిరుపతిరెడ్డి, నగునూరి అశోక్, పురుషోత్తంరావు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ధీర వనిత కామ్రేడ్ కూర మల్లమ్మ

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క



నివాళి అర్పిస్తున్న విమలక్క, ఉద్యమకారులు

వేములవాడ: నిత్య నిర్బంధాల మధ్య దాదాపు నిండు నూరేళ్లు జీవించిన కామ్రేడ్ కూర మల్లమ్మ పోరాటవీరులకు జన్మనిచ్చిన మహాతల్లి అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క కొనియాడారు. వేములవాడ పట్టణంలోని మల్లమ్మ ఇంట్లో మంగళవారం ఆమె 5వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. మల్లమ్మ ఠాణాల చుట్టూ తిరిగినా ఏనాడూ తన పిల్లలకు లొంగిపోవాలని చెప్పని ధీర వనిత అన్నారు. చిన్న కొడుకు జైల్లో, పెద్ద కొడుకు అజ్ఞాతంలో ఉండగా భర్త బాలయ్య మరణిస్తే ఆయన చితికి నిప్పు పెట్టారని పేర్కొన్నారు. మల్లమ్మ యాదిలో అమర్ రాసిన పాటను పాడి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రామిక శక్తి రాష్ట్ర నాయకురాలు రాజేశ్వరి, రేవతి, పురుషోత్తంరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, పోతుల రమేష్, రాకేశ్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో తాహెర్‌కొండాపూర్ ముందంజ

- శిక్షణ అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని తాహెర్‌కొండాపూర్‌లో మంగళవారం 5 జిల్లాల శిక్షణ అధికారులు పర్యటించారు. పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం, ఆరోగ్యం తదితర అంశాలపై కరీంనగర్‌లో రెండు రోజుల శిక్షణకు హాజరైన కొమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు యూనిసెఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ కిషన్‌స్వామి ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. మరుగుదొడ్ల వినియోగం, మురికి కాల్వల నిర్వహణ, తడి, పొడి చెత్త తరలింపు, కంపోస్టు షెడ్డు నిర్వహిస్తున్న తీరు, అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీలో మొక్కల పెంపకం, వైకుంఠధామం తదితరాలపై స్థానికులతో మాట్లాడారు. స్వచ్ఛత, పరిశుభ్రతలో తాహెర్‌కొండాపూర్ జిల్లాలోని మిగిలిన గ్రామాల కంటే ముందంజలో ఉందని తెలిపారు. అనంతరం చెర్లభూత్కూర్‌లో పారిశుధ్య కార్మికులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ వాష్ కన్సల్టెంట్ ఫణీంద్రకుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, సర్పంచు మడికంటి మమత, ఎస్‌బీఎం సభ్యులు రమేశ్, వేణు, ఫణి, హరిణి, సురేశ్, రాఘవులు పాల్గొన్నారు.

చోరీలు చేస్తున్న యువకుల అరెస్టు

- 11 విద్యుత్ మోటార్లు, ఒక ట్రాక్టర్ ట్రాలీ స్వాధీనం



ట్రాలీ, మోటార్లను చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: జల్సాలకు అలవాటు పడి, చోరీలు చేస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్‌కు చెందిన గుగ్లావత్ నరేశ్, జరుపుల ప్రకాశ్, గుగ్లావత్ రవిలాల్, గుగ్లావత్ అనిల్ జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. గత నవంబర్ 10న గ్రామ శివారులో విద్యుత్ మోటార్లు చోరీ చేయడానికి వెళ్తుండగా ఓ ట్రాక్టర్ ట్రాలీ కనిపించడంతో తీసుకెళ్లి, పొదల్లో దాచిపెట్టారు. గడిచిన మూడు నెలల్లో ఆత్మకూర్‌తోపాటు జగ్గాసాగర్, రాఘవపేట, వెల్లుల్ల తదితర గ్రామాల్లో 11 విద్యుత్ మోటార్లను దొంగలించారు. వాటిని నిజామాబాద్‌లో విక్రయించడానికి మంగళవారం ట్రాలీలో తీసుకెళ్తుండగా జగ్గాసాగర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. మోటార్లను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

ఏ దేశం పోయినా పని దొరకలే

- అప్పు తీర్చే మార్గం లేదు
- మనస్తాపంతో వలసజీవి ఆత్మహత్య
- ధర్మారంలో విషాదం



అంకూస్ మృతదేహం

జగిత్యాల క్రైం: ఊళ్లో పని లేదు.. ఉపాధి కోసం అప్పు చేసి, దేశాలు తిరిగాడు.. ఎక్కడా పని దొరకలేదు.. చివరికి స్వగ్రామం చేరాడు.. పనిలేక.. అప్పు తీర్చే మార్గం లేక తనువు చాలించాడు జగిత్యాల రూరల్ మండలం ధర్మారానికి చెందిన నేరెళ్ల అంకూస్(44). ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. అంకూస్ జీవనోపాధి కోసం అప్పు చేసి, దుబాయ్ వెళ్లాడు. అక్కడ పని లేకపోవడంతో సౌదీ వెళ్లాడు. అక్కడి కంపెనీ జీతాలు ఇవ్వకపోవడంతో తిరిగి వచ్చాడు. మళ్లీ అప్పు చేసి, ఇరాక్ వెళ్లాడు. అక్కడా పని లేకపోవడంతో స్వగ్రామం చేరాడు. తనకు పని లేదని, అప్పు ఎలా తీర్చాలంటూ నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం లక్ష్మీపూర్ శివారులో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



స్వామివారి చిత్రపటం తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు

వేములవాడ: వేములాడ రాజన్న సన్నిధిలో 5 రోజులపాటు జరిగే త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు పూజలు చేశారు. అనంతరం త్యాగరాజస్వామి వారి చిత్రపటాన్ని పురవీధుల గుండా సభావేదిక వద్దకు తీసుకొచ్చారు. స్థానిక సరస్వతి శిశుమందిర్ విద్యార్థినుల కోలాట విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఉపన్యాసకుడు పాలెపు చంద్రశేఖర్ శర్మ త్యాగరాజస్వామి జీవిత విశేషాలు, జోత్స్న బృందంచే పంచరత్న గానం, స్వర్ణలత హరికథ, పద్మలత బృందంచే సంగీత కచేరి, గుమ్మడి జనార్దన్, వాణిలచే సితార సోలో కచేరి, ఉమాదేవి సంగీత కచేరి, మంగళంపల్లి స్వర్ణలత శాస్త్రీయ సంగీత కచేరి, రేఖ బృందం నృత్య ప్రదర్శన, దుర్గాభవాని నాట్య మండలి వారిచే నాటక కార్యక్రమాలు నిర్వహించాయి. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకుడు శంకర్, కళాకారులు పాల్గొన్నారు.



శిశుమందిర్ విద్యార్థినుల కోలాట ప్రదర్శన



హరికథ చెబుతున్న స్వర్ణలత

అంజన్న సేవలో భక్తజనం

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు మంగళవారం వేలాదిగా తరలివచ్చారు. కోనేరులో స్నానాలు చేసి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తాగునీరు, పార్కింగ్ స్థలం లేక ఇబ్బంది పడ్డారు. ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, సిబ్బంది అందుబాటులో ఉన్నారు.



ఆలయం ఎదుట భక్తుల సందడి



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బేతాళస్వామి ఆలయంలో పూజలు